

# అన్నపూర్ణ

– వి.ఇందిరాదేవి

ఒకసారి ...

శ్రీశ్రీ ఆనందగజపతి మహారాజుగారు విజయనగరమున సరససల్లాప సంకథా వినోదంబుల కొలువు తీరియున్నారు.

ఒక గాయకుడు గోగులపాటి కూర్మనాథ కవి రచించిన సింహాద్రి నారసింహ శతకము నుండి కొన్ని పద్యములను వినిపించినాడు.

ఆనందగజపతి మహారాజు సింహాచలమున వెలసియున్న శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామివారి భక్తుడు. సింహాచల దేవస్థానమునుండి వచ్చిన కొందరు వేదపండితులు ప్రభువును ఆశీర్వదించినారు. అత్యంత ప్రాచీనమైన మహాక్షేత్రం సింహాచలం. కొంతభాగం శిథిలమవుతున్నదని వారు నివేదించగా వెంటనే మరమ్మత్తులు ప్రారంభించుటకు ఆజ్ఞాపించినాడు ప్రభువు.

మిగిలిన రాచకార్యములు పూర్తికాగానే సందర్శకులకు పిలుపు వచ్చినది.

ఒక కవి ప్రవేశించి మహారాజును తను రచించిన పద్యముతో ఆశీర్వదించినాడు.

"తమ ఇంటిపేరేమిటి కవీంద్రా?" ప్రశ్నించాడు ఆనందగజపతి.

"నడిమింటి, మహారాజా!"

"నడిమింటి(ని) వాసపు విలువ ఎంత కవీశ్వరా?"

"ప్రభూ! ఎంత తక్కువైనను కనీసము 'పూసపాటి'చేయదా?"

మహారాజు చకితుడైనాడు. కవి చమత్కృతి గుండె లోతుల్లో పులకరింత రేపింది. అయినా రాజుగారు బయటపడకూడదు కదా! ముఖము గంభీరంగానే కాక, కొంత కఠినంగా కూడా మార్చినాడు.

సభ్యులు నిర్ఘాంతపోయారు. రాజసభా వ్యవహారాలలో తలలు పండిన వృద్ధులు "అయ్యో! ఈ కవి పని అయిపోయినదే! ఎందుకింత సాహసమున కొడిగట్టినాడు? ఉట్టి మూర్ఖునివలె నున్నాడే! కానిపక్షమున రాజుగారి ఇంటిపేరును అపహాస్యము చేయ సాహసించునా? నాలుగు కాలములపాటు బ్రతికి బట్టగట్టదలుచుకొనలేదా ఏమి? రాజసభలో వదరుబోతు తనము రాణించదని ఎరుగడా ఏమి?" అని బాధపడినారు.

యువకులు కుతూహలముతో చూచుచున్నారు.

ఇంతలో రాజుగారి కనుసన్నతో విలువైన కానుకలు కొనిరాబడినవి. వానిని చేముట్టి కవికి



పంపించుచూ, "నడిమింటి కవివర్యా! మీ చమత్కారమునకు ఈ పూసపాటి ఆనందగజపతి రాజే కాదు, యావదాంధ్రమును పులకించవలెను!" అనినాడు మహారాజు.

"మహారాజా! తమ సహృదయము, సరసత్వము ఆచంద్రార్కము ఆంధ్రదేశముల ప్రతిధ్వనించును గాత!" యనుచు ఒడలు గగుర్పొడవగా కవి పద్యవర్షముచే సభను ముంచివేసెను.

ఆంధ్ర సరస్వతి చిరునవ్వు నవ్వుకున్న క్షణమది.

అనంతరం గిరిజనులు, ఆటవికులు కొందరు మహారాజుకు మొక్కి పుట్టతేనె, ఫలములను కానుకగా అందించినారు. వన్యప్రాంతములో మెకముల బెడద ఎక్కువగా ఉన్నదని, రాజుగారు వేటకు విచ్చేసి గూడెములకు రక్షణ కల్పించవలసిందని విన్నవించుకున్నారు.

"అట్లే!" యని అభయమిచ్చినాడు మహారాజు.

000

జోళ్లు, వలలు, ఎరలు, ఆయుధములు, రేచుకుక్కలు, భటులు ... వేటకు వలసిన సంభారములతో, వేటగాళ్లతో కలిసి ఆనందగజపతి బయలుదేరినాడు స్వయంగా.

కొన్ని క్రూరజంతువులను సంహరించినాడు.

అత్యద్భుతమూ, నిరుపమానమూ అయిన తూర్పు కనుమల సౌందర్యమును ఎన్నిసార్లు తిలకించిననూ తృప్తి కలగదు.

మహారాజు ప్రకృతి స్వచ్ఛత్వమును మనసా అనుభవించుచూ ఒకింత ఏమరుపాటుకు లోనాయెను. కాసింతసేపునకు అచట ఒక్కడే మిగిలెను.

జంతువులను తరుముచూ భటులు వెళ్లిపోయినారు. తానెక్కిన అశ్వమునుత్సాహపరచుచూ మహారాజు బయలుదేరినాడు. ఎంతసేపటికినీ భటబృందము కనిపించలేదు సరికదా, పర్వతప్రాంతము తగ్గి అటవీ ప్రాంతము విస్తరించి యున్నది పోనుపోను. దూరమున పరిగెత్తుచున్న క్రూరజంతువు కనబడినది. అశ్వము నటు దూకించినాడు రాజు. చాలా దూరము తరిమినాడు కానీ అది కనపడలేదు చివరికి.

పొద్దు నడినెత్తిమీదకు వచ్చినది. సూర్యభగవానుడు ప్రచండ తేజమును లోకముల బరపుచున్నాడు. వేడిగాలులు చుట్టుముట్టుచున్నవి. దాహముతో, ఆకలితో మహారాజు కనులు తిరిగిపోవుచున్నవి. కనుచూపుమేర జలాశయము కనపడుటలేదు. అటులనే హయమునిం కొంత ముందుకు నడిపించినాడు. పాపము, ఆ నోరులేని జంతువు గుర్రము కూడా నీరసపడిపోయినది. ఎట్టకేలకు బహుదూరమున కొన్ని పూరి ఇళ్లు కనపడినవి. అతికష్టమున ఆ పల్లెకి చేరినాడు రాజుగారు. ఒక ఇంటిముందు గుర్రము దిగి, "అమ్మా! అన్నపూర్ణమ్మా! భవతి భిక్షాందేహి!" అని అరచి సొమ్మసిల్లి పడిపోయినాడు. పట్టు పరుపులపైన శయనించినా నిద్రపట్టని మహారాజుకి మట్టి అరుగు జోలపాడినది.

లోపల పెరట్లో ఉన్న ఆ ఇల్లాలు పరిగెత్తుకొని వచ్చినది. నిజంగా ఆమెపేరు అన్నపూర్ణమ్మే అగుట యాదృచ్ఛికం.

వాకిట్లో అరుగుమీద పడుకునియున్న వ్యక్తిని చూసినది. ఎవరో బాగా ధనవంతుడల్లే ఉన్నాడు అనుకుంది. పైగా గుర్రమొకటి ఉండెను.

గబగబా లోపలికి వెళ్లి చల్లలో కాస్త ఉప్పు వేసి తీసుకొచ్చినది. "అయ్యా! బాబుగారూ! ఎండవేళ శోష వచ్చినట్లున్నది. కొంచెము ఓపిక తెచ్చుకుని, కనులు తెరచి ఈ మజ్జిగను త్రాగండి!" అని పిలచినది. అతి కష్టముమీద కనులు తెరచి గటగట మజ్జిగను తాగినాడు రాజుగారు.

ఈలోపల గాబులో నీరుపోసి గుర్రము ముందుంచి ఇంటిలోనికేగినది. పదార్థము లేవియూ లేవు. ఉండుటకు వీలునూ లేదు. ఆమె భర్త యాయవారపు బ్రాహ్మణుడు. అప్పుడప్పుడూ ఆ భార్యా భర్తలకు పస్తులు తప్పవు. ఎవరో ధనికుడు దానము చేసిన ఆవుమటుకు వారిని కన్నతల్లివలె కాపాడుచున్నది. మజ్జిగకు, నేతికి కొరత లేదు. ఏమి చేయవలయునో తోచలేదామెకు. దగ్గరగా చుట్టుపక్కల ఇళ్లు కూడా లేవు. తమ భోజనములైపోయినవి. భర్త పొరుగూరికేగినాడు.

అదృష్టము వలన కాస్త అన్నము మాత్రము మిగిలినదాపూట. చిక్కని మజ్జిగ యుండనే యున్నది.

కష్టపడి పొయ్యి వెలిగించి చారు దానిపై పెట్టినది. పెరటిలోనికి వెళ్లినది సాలోచనగా.

ఈ లోపల కొంత ప్రాణము తేరుకున్న ఆనందగజపతి నూతివద్దకు వెళ్లి, కాళ్లు చేతులు కడుగుకొని ముఖముపై చన్నీరు చిలకరించుకుని సేదదీరినాడు. గుర్రము కూడా నీరు తాగి తేరుకొనుట చూచినాడు.

ఆవు కొరకు తెచ్చిన గడ్డిని కొంచెము అశ్వము ముందు పెట్టినదామె. "అయ్యా! మా బీద ఇంట రుచికరమైన అన్నపానీయాలు దొరకనందుకు చింతించుచున్నాను!" అన్నది అన్నపూర్ణ తలవంచుకుని.

"తల్లీ! ఏదో ఇంత అన్నము పెట్టినచో చాలు ఆకొన్న కడుపునకు!" అనినాడు ఆనందగజపతి.

అన్నపూర్ణ ఒక్క నిముషమాలోచనలో పడినది. అతిథి ఎవరో తెలియలేదు. వంట ఇంటిలోనికి పిలిచి అన్నము పెట్టునట్లు లేదు. అట్లని వసారాలో కూడదు.

నడిమింట విస్తరి వేయ నిశ్చయించుకొనినది అన్నపూర్ణ.

పీట వాల్చి కంచు చెంబుతో మంచినీళ్లు పెట్టినది. విస్తరి వేసి నీళ్లు చల్లి, "బాబుగారూ! నడిమింట భోజనము చేయుటకు రమ్మ"ని

పిలిచినది.

కవి గుర్తుకు వచ్చి "నడివింటిలోనా?"యని ఒక్క క్షణం చకితుడైనాడు ఆనందగజపతి. ఆ వెంటనే ఆయనకు తన మహావైభవమంతయూ మనసులో తోచినది.

ఈ పూరింట ఈ ఇల్లాలి వంట ఈనాడు తనకు ప్రాప్తము, అని విధి లిఖించి యున్నది గాబోలు. అసలు ఈ ఆకలి ఎంత చెడ్డది! ఎంతటివాడినైననూ తన ఉక్కు హస్తములతో బంధించగలదు గదా! అని నవ్వుకుని పీటమీద కూర్చునినాడాయన.

కూరగానీ, పప్పుగానీ ఏవియూ లేవని బాధపడుచునే అన్నపూర్ణ పచ్చడి వడ్డించినది. నాలుగు వడియములు వేసినది. పచ్చడిలో ఘుమఘుమలాడుచున్న నేయి వేసినది.

పచ్చడి రుచి అద్భుతముగా నున్నది రాజుగారికి. మరికాస్త వడ్డించమని అడిగినాడు. "బాబుగారూ! పచ్చడిలో మెంతి మజ్జిగ నంచుకున్నచో బాగుండు"నని పక్కన వేసినది. చారులో పోపు పెట్టునప్పుడే కొంచెము మజ్జిగ తీసి దానిలో కూడా నేతితో పోపు వేసినదామె. పెరటిలోనుంచి కరివేపాకు, కొత్తిమీర తెచ్చి రెండింటిలోనూ వేసినది. పసుపు వేసినది. మెంతి మజ్జిగలో వాము వేసినది. చారులో పిసరంత బెల్లము వేసినది.

అతిథికి విస్తరి భోజనము కొత్త యనుకొని విస్తరి క్రింద మరొకటి వేసినది అన్నపూర్ణ. అయిననూ మెంతి మజ్జిగ, చారు, మజ్జిగ తినునప్పుడు ఆయన ఒకింత ఇబ్బంది పడినాడు గానీ, భోజనము మాత్రము అమృతతుల్యముగా నున్నది. పచ్చడిలో మెంతి మజ్జిగ, చారులో వడియములు నంచుకున్నచో రుచి ఎక్కువగునని ఆ అన్నపూర్ణమ్మ తల్లి ఎంత చక్కగా చెప్పినది! భక్ష్య భోజ్య చోష్య లేహ్యములతో అపురూపమైన భోజనము చేయు నా రాజుగారికి ఈ భోజనం చాలా నచ్చినది. ప్రాణములు కుదుటపడినవి. ఆత్మారాముడు శాంతించినాడు.

"బాబుగారూ! నిన్న పేరంటమునకు వెళ్లినప్పుడు అరటి పండిచ్చినారు. కొంచెము మిగలపండినది. ఏమియు ననుకొనవలదు!" అని చివరలో అరటిపండిచ్చినదామె. ఆమె అన్నపూర్ణ నిజముగా.

రాజుగారి కన్నులు చెమ్మగిల్లినవి.

"నిత్యానందకరీ! వరాభయకరీ! కృపావలంబనకరీ! మాతా అన్నపూర్ణేశ్వరీ! తల్లీ! కడుపునిండినదమ్మా! నేను పుట్టి బుద్దెరిగిన తరువాత ఇట్టి అమృతప్రాయమైన భోజనము చేయలేదు. ఇంత బీదరికములోనూ ఎంత చక్కని భోజనం పెట్టితివి! ఇంతకూ పచ్చడి పేరేమిటో ఎంతకునూ చెప్పుటలేదు. ఇంక నేను తిరిగి వెళ్లవలెను గదా! ఆ పచ్చడి పేరు చెప్పుమమ్మా! మా ఇంటికడ మరల మరల చేయించుకొనుచుందును!" అని నవ్వుచూ బ్రతిమిలాడినాడు ఆనందగజపతి.

"వద్దు బాబుగారూ! వద్దు! మీవంటి మహారాజులకీ పచ్చడి ఖర్మమేమి? ఇంట్లో పదార్థములు నిండుకొనుట వలన గత్యంతరము లేక నేను తమకా పచ్చడి వడ్డించవలసి వచ్చినది గాని ..." అన్నపూర్ణ గాభరా రాజుకు అర్థము కాలేదు. ఇంతలో రాజభటులు ఆయనను వెతుకుకొనుచూ బిలబిల వచ్చినారు.

అన్నపూర్ణ నిర్ఘాంతపోయినది.

"మరి వెళ్లివత్తునా అమ్మా!" అని రాజుగారు అడుగుటతో మరింత మతిపోయినది.

"ఇంతకునూ పచ్చిడి పేరు చెప్పవా తల్లీ?" అని మరల అడిగినారు ఆనందగజపతి.

"నన్ను క్షమించగలరా బాబుగారూ! తెలియక మిమ్మల్ని ఎంతో అమర్యాద చేసినాను. అయ్యో ...! వేరే దారిలేక పెరట్లో గరిక కోసి పచ్చడి చేసినానే! తమరు సాక్షాత్తూ ఆనందగజపతి మహారాజులని ఎరుగకపోయితినే!" అని గిలగిలలాడినదామె.

ఒక్క క్షణంలో అక్కడ నిశ్శబ్దం! రాజుని వెతుకుకొనుచూ వచ్చిన భటులూ, అధికారులూ తెల్లబోయినారు. ఈమెకేమి మూడినదో అని భయపడినారు.

"తెలియక చేసిన తప్పుకు శిక్షార్హురాలిని మహారాజా!" అన్నదామె నిబ్బరంగా.

అప్పుడు నవ్వినాడు ఆనందగజపతి హాయిగా, హృదయపూర్వకంగా తెరలు తెరలుగా. "అమ్మా! మా గుర్రమునకు, మాకు గడ్డిపెట్టి బతికించినావన్నమాట! అర్థమైనదమ్మా ఈ గరికలో ఇంత రుచి, ఇంత బుద్ధీ దాగి ఉన్నదన్న విషయం అర్థమైనది! ఉత్తమ ఇల్లాలా! ఈ చుట్టుప్రక్కల గ్రామమంతయునూ నీకు అగ్రహారముగా దానమిచ్చుచున్నాము. నీ తెలివికే కాదు, నీ ఆదర బుద్ధికీ కృతజ్ఞతా చిహ్నముగ ఇకపైన ఈ గ్రామము 'గరికవలస' అగ్రహారముగా పరగును గాక!" అనుచు అప్పటికప్పుడు వలసిన పత్రములు సిద్ధము చేయించి అన్నపూర్ణమ్మ చేతికిచ్చి పరివార సహితముగ వెడలిపోయినాడు ఆనందగజపతి అశ్వారూఢుడై.

ఈ గరిక కథ తెలుగునాట మిక్కిలి ప్రాచుర్యము పొందినదే!

నూజివీడు ప్రభువు వేటకొరకై వచ్చి ఇట్టి పరిస్థితిలోనే చిక్కుపడగా నొక ఇల్లాలు అన్నములో గరిక పచ్చడి వడ్డించినదని కూడా మరొక యైతిహ్యము కలదు. నూజివీడు జమీందారు ఆమెకు దానము చేసిన గ్రామము పేరు గరికపాడు.

విజయనగర ఆనందగజపతిగానీ, నూజివీడు జమీందారుగానీ (మనకి ఇతమిత్థంగా తెలియదు) ప్రదర్శించిన ఔదార్యమునకు చిహ్నము లీ గరికాగ్రహారములు.

అంతకన్ననూ ఒక ఇల్లాలి సౌమనస్యమునకునూ, బుద్ధివైభవమునకునూ శాశ్వత నీరాజనము లీ గరికవలస, గరికపాడు అగ్రహారములు.

000

(జనం చెప్పుకునే కథల ఆధారంగా)

